ఇంటెల్లిపాది బారులుదీరి..!

యూరియా కోసం రైతు కుటుంబాల పడిగాపులు

- ఉదయం నుంచే పీఏసీఎస్‌లు, రైతుల వేదికల వద్ద క్యూ
- ఇచ్చేది ఒకటి, రెండు బస్తాలే.. అయినా తప్పని నిరీక్షణ
- కొందరికి అసలే అందక నిరాశ
- ఆవేదన చెందుతున్న అన్నదాత


హాలియా : కొత్తపల్లి రైతు వేదిక వద్ద బారులుదీరిన రైతులు

యూరియా కష్టాలు రైతులను వేధిస్తున్నాయి. వరి, పత్తి, మిరప పంటలతో పాటు పండ్ల తోటల ఎదుగుదలకు యూరియా అవసరం ఏర్పడింది. అష్టకష్టాల కోర్చి సాగు చేపడితే.. సరైన సమయంలో యూరియా అందకపోవడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇచ్చే ఒకటి రెండు బస్తాల యూరియా కోసం ఇంటిల్లిపాదీ పీఏసీఎస్‌లు, రైతు వేదికల వద్ద క్యూ కడుతున్నారు. కొందరికి అసలే అందక నిరాశతో వెనుదిరుగుతున్నారు.

హాలియా : యూరియా కోసం రైతులకు కష్టాలు తప్పడం లేదు. గంటల తరబడి నిరీక్షించినా, యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం అనుముల మండలంలోని కొత్తపల్లి పీఏసీఎస్‌కు 40 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని వివిధ గ్రామాల రైతులు తెల్లవారుజాము నుంచే కొత్తపల్లి సొసైటీ వద్ద పెద్ద సంఖ్యలో బారులుదీరారు. పోలీసుల పహారాలో యూరియా పంపిణీ జరిగింది. ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇచ్చారు. రోజంతా నిరీక్షించినా కొద్దిమంది రైతులకు మాత్రమే యూరియా దొరికింది.

పెద్దవూర : యూరియా కోసం పెద్దవూర మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు ఉదయం నాలుగైదు గంటలకే పీఏసీఎస్ వద్దకు చేరుకుని క్యూలో నిలబడుతున్నారు. శుక్రవారం రైతులు ఎక్కువగా రావడంతో గొడవలు జరగకుండా ఒక ఏఎస్‌ఐ, ఇద్దరు మహిళలతో పాటు మొత్తం ఐదుగురు పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు.

త్రిపురారం : మండలంలోని గ్రామాల్లో రైతులను యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. శుక్రవారం యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయం ఆరు గంటల నుంచే త్రిపురారం రైతు వేదిక, పెద్దదేవులపల్లి, బాబుసాయిపేట పీఏసీఎస్‌ల వద్ద బారులుదీరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు అన్నం చద్దులతో యూరియా కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసుల పర్యవేక్షణలో ప్రతి ఆధార్ కార్డుకు రెండు బస్తాలు పంపిణీ చేశారు.

నిడమనూరు : నిడమనూరు సహకార సంఘం వద్ద రైతులు తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో వేచి చూస్తున్నారు. శుక్రవారం నిడమనూరు సహకార సంఘానికి 40 టన్నుల (888 బస్తాలు), వెనిగండ్ల సహకార సంఘానికి 20 టన్నుల (444 బస్తాలు) యూరియా వచ్చింది. ప్రతి ఆధార్ కార్డుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. నిడమనూరు సహకార సంఘంలో ఉదయం 12 గంటలలోపు పంపిణీ పూర్తయింది. ఐదు రోజుల తర్వాత యూరియా రావడంతో నిడమనూరు మండలం శివారు గ్రామాలైన నేతాపురం, మేగ్యాతండా, శిల్లాతండా, రాంనగర్ తండాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు వచ్చారు. సహకార గోదాము వద్ద యూరియా లారీ నుంచే నేరుగా రైతులకు అందిస్తున్నారు.


నిడమనూరు : సహకార సంఘం గోదాము వద్ద..


దామరచర్లలో రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

డిండి : వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంట పొలాలకు సరిపడా యూరియాను రైతులకు అందించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ మైనొద్దీన్ ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు రోజూ పీఏసీఎస్ గోదాముల వద్ద ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాడుగులపల్లి : ప్రభుత్వం సకాలంలో సరిపడా యూరియా అందించకపోవడంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందన్న సమాచారంతో గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొంటే కొంతమందికే ఇచ్చి అయిపోయిందని చెప్తున్నారని రైతులు తెలిపారు. ఎస్ఐ కృష్ణయ్య అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఇదిలా ఉండగా యూరియా కోసం క్యూలో నిలబడ్డ సమయంలో తోపులాట జరగడంతో ఇందుగుల గ్రామానికి చెందిన మహిళారైతు కామెల్లి యల్లమ్మ చేతికి గాయమైంది.

చందంపేట : మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద శుక్రవారం యూరియా లోడ్ వస్తుందన్న సమాచారంతో ఒక్కసారిగా రైతులు అక్కడికి చేరుకున్నారు. అయితే 220 బస్తాల యూరియా మాత్రమే రావడంతో చాలా మంది రైతులు యూరియా బస్తాలు అందక వెనుదిరిగారు.

పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి పెద్దఅడిశర్లపల్లి మండలంలో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద, గుడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులు యూరియా కోసం పెద్ద ఎత్తున బారులుదీరారు. పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద పలువురు రైతులు ఒక్కసారిగా గోదాముపై ఎగబడి బస్తాలు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పీఏసీఎస్ కేంద్రం సిబ్బంది పోలీసుల సహాయంతో గోదామును మూసివేసి యూరియా పంపిణీ నిలిపివేశారు. పరిస్థితి సద్దుమణగడంతో తిరిగి పోలీసు బందోబస్తు నడుమ యూరియా పంపిణీ చేశారు.

కొండమల్లేపల్లి : యూరియా వస్తుందని తెలిసి శుక్రవారం ఉదయం కొండమల్లేపల్లి మన గ్రోమోర్‌కు వచ్చిన రైతులకు నిరాశే మిగిలింది. రెండు లారీల యూరియా రావాల్సి ఉండగా ఒక లారీ మాత్రమే రావడంతో రైతులు ఆందోళన చెందారు. పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, ఏటీ జానకిరాములును నిలదీశారు. ఇదిలా ఉంటే ఓ అధికార పార్టీ నాయకుడు తన వాళ్లకి ఎలాంటి టోకెన్లు లేకుండా యూరియా తీసుకెళ్లడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


పెద్దవూర పీఏసీఎస్ ముందు యూరియా కోసం నిల్చున్న రైతులు


త్రిపురారంలో రైతు వేదిక వద్ద..

క్లుప్తంగా

నేడు జాతీయ లోక్‌అదాలత్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవా సంస్థ అధ్యక్షుడు, మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ప్రిలిటిగేషన్ కేసులు, బ్యాంకు కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలి పారు.

ఎంపీఓగా లింగయ్య



నిడమనూరు : నిడమనూరు మండల పంచాయతీ అధికారిగా గంగుల లింగయ్య బాధ్యతలు స్వీకరించారు. తుమ్మడం పంచాయతీ అధికారిగా ఉన్న లింగయ్యకు ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంపీఓగా ఉన్న సైదులు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితుల కారణంగా విధుల్లో నుంచి వైదొలగారు. ఈ నేపథ్యంలో తుమ్మడం పంచాయతీ కార్యదర్శి లింగయ్య ఎంపీఓగా బాధ్యతలు చేపట్టారు. కాగా, రెగ్యులర్ ఎంపీఓగా ఉన్న కేదార్‌నాథ్ డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

మిర్యాలగూడ : పట్టణంలోని ఈదులగూడలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు దాతల సహకారంతో రూ.65 వేలతో ఆర్‌ఓ ప్యూరీఫయర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం వాటర్ ప్లాంటును ఎంఎస్‌ఓ ఆర్.మంగ్యానాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు డి.ధర్మానాయక్ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.లక్ష్మీ, కొనకంచి వెంకటేశ్వర్లు, ఎం.జ్యోతితో పాటు దాతలు కరుణాకర్‌రెడ్డి, మదార్, కోటిరెడ్డి, వెంకటరెడ్డి, సక్కుబాయి, యశ్వంత్‌రెడ్డి, అర్జున్, లక్ష్మమ్మ, సాయినందన్, సంధ్య, శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.లాలు, ఏఏపీసీ చైర్మన్ ఈ.కవిత, మన్నెం సత్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, బీఎం.నాయుడు, యనగండ్ల లింగయ్య, సుందరి నాగయ్య, రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జ్యోతి, భిక్షం, లక్ష్మి, సురేందర్, రాఘవరెడ్డి, కుమార్, రత్నకుమారి, మహిత, శ్రీదేవి, సైదులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

మిర్యాలగూడ : ఫర్టిలైజర్స్‌కు కేటాయించిన యూరియా కోటాను విక్రయించడంలో జరుగుతున్న జాప్యంపై ఫిర్యాదులు అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు మహేందర్, శివ, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్‌తో కలిసి మిర్యాలగూడలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పాత వ్యవసాయ మార్కెట్ యార్డు రోడ్డులోని రైతుమిత్ర ఫర్టిలైజర్స్ దుకాణానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా కోటాను అధికారులు కేటాయించారు. అయితే దుకాణంలో దిగుమతైన యూరియాను రైతులు విక్రయించడంలో డీలర్ నిర్లక్ష్యం ప్రదర్శించడంతో 100కు ఫోన్ చేసి పలువురు రైతులు ఫిర్యాదులు చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి స్టాక్, సేల్ రికార్డులను పరిశీలించారు. యూరియా కోటాను విక్రయించకుండా గోదాంలోనే నిల్వ చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. గోదాం తాళాలను స్వాధీనం చేసుకొని ఫర్టిలైజర్స్ డీలర్ అశోక్‌రెడ్డిని ప్రశ్నించారు. సర్వర్ బిజీ కారణంగా ఈ పాస్ మిషన్ ఐడీ అప్రూవల్‌లో ఆలస్యం కావడంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు యూరియా విక్రయాల్లో జాప్యం జరిగిందని డీలర్ అధికారులతో చెప్పారు. దీనిపై మరింత లోతుగా విచారించేందుకు డీలర్‌ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా విచారణ అనంతరం ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు తెలిపారు.

సభలను జయప్రదం చేయాలి

దేవరకొండ : అక్టోబర్ 26, 27 తేదీలలో దేవరకొండ పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలో నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వర్గం హక్కుల కోసం సమరశీల ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సీఐటీయూకు ఉందని ఆయన అన్నారు. ఐక్యత, పోరాటం అనే నినాదంతో 1970లో ఏర్పడిన సీఐటీయూ అప్పటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్య ఉద్యమాల బాట పట్టించిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, మండల కన్వీనర్ రహీం, ఓడపల్లి యాదగిరి, బిజిలి లింగయ్య, బుడిగ వెంకటేష్, పుష్పలత, జ్యోతి, ముత్యాలు, ఇద్దయ్య, ఆంజనేయులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం కుమ్మరి కుండల వ్యాపారుల సంఘం నియోజకవర్గ స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా మల్లికంటి వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా పెద్ద అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి అశోక్, కోశాధికారిగా గుమ్మడేల్లి వెంకటేష్, కార్యదర్శిగా నిమ్మనగోటి భాగ్యమ్మ, కమిటీ సభ్యులుగా నీలకంఠం లక్ష్మమ్మ, యాదయ్యను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నేతలు బి. శ్రీను, నాగయ్య, సైదులు, బి.సైదమ్మ, తోట సైదమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి మండల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బాలునాయక్


చింతపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కొండమల్లేపల్లి (చింతపల్లి) : చింతపల్లి మండలం సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన చింతపల్లి మండల కేంద్రంలోని పలు వీధుల్లో కాలినడకన పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ తరి రాములు

పెద్దవూర : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని గర్నెకుంట గ్రామంలోని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అండర్–14, అండర్–17 విభాగాల్లో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఓటమి గెలుపునకు నాంది కావాలని, ఓడిపోయినంత మాత్రాన బాధపడొద్దని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు కోరె సుదర్శన్, శ్రీనివాస్, క్రీడా సెక్రటరీ విమల, పాఠశాల ప్రిన్సిపాల్ మార్టిన్, రామాంజిరెడ్డి, పీడీలు శోభారాణి, కూతాటి మురళి, శివరాం, రామయ్య, ముత్తయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత జెండా ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 22వ తేదీ నుంచి కనకదుర్గ అమ్మవారి నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని 19వ వార్డులో దుర్గామాత జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటానికి శ్రీనివాసశర్మ వేదమంత్రోత్సవాల మధ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తిరునగరు మల్లేశ్వరమ్మకు కన్నీటి వీడ్కోలు


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ టౌన్: మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్ తల్లి తిరునగరు మల్లేశ్వరమ్మ రెండు రోజుల క్రితం మృతిచెందారు. అమెరికాలో ఉంటున్న ఆమె కుటుంబ సభ్యులు రావడంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి నుంచి భౌతికకాయాన్ని శుక్రవారం మిర్యాలగూడకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి .. మల్లేశ్వరమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షాబునగర్ నుంచి శ్మశానవాటిక వరకు సాగిన అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు పాల్గొని పాడె మోశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఐ అండ్ ఆర్గాన్ డోనేషన్ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర్ రావు ఆధ్వర్యంలో మల్లేశ్వరమ్మ నేత్రాలను నల్లగొండ ఐ బ్యాంకు ద్వారా అగర్వాల్ హాస్పిటల్‌కు పంపించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు నల్లమోతు సిద్దార్థ, చిట్టిబాబునాయక్, యడవల్లి శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, స్కైలాబ్‌నాయక్, వేణు, నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, చిలుకూరి బాలు, జానకిరాంరెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి


పెద్దవూర : బట్టుగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉమాదేవి

పెద్దవూర : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేక అధికారి ఎస్పీ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి 566 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో 114 ఇళ్ల బేస్‌మెంట్ నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో వారం రోజుల్లో నిధులు జమ చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ మానే ఉమాదేవి, ఏపీఓ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, నాగిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ముంతాజ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

మండలంలోని బట్టుగూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఎంపీడీఓ మానే ఉమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి వర్ర నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కూతాటి అర్జున్ తదితరులు ఉన్నారు.

సాయుధ పోరాటాల వారసత్వమే కమ్యూనిస్టులు

డిండి : సాయుధ పోరాటాల వారసత్వమే కమ్యూనిస్టులని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని అమరవీరులైన కృష్ణశర్మ, పెద్దయ్య, వెంకటయ్య స్మారక స్థూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ మైనొద్దీన్, వెంకటరమణ, కనకాచారి, విజయేందర్ రెడ్డి, శైలేష్, చక్రి, వినయ్ పాల్గొన్నారు.

లౌకిక విలువల కోసం ఏచూరి పోరాటం


మిర్యాలగూడ అర్బన్ : సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


త్రిపురారంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : లౌకిక విలువల కోసం సీతారాం ఏచూరి జీవితాంతం పోరాడారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయ రంగంలో ఏచూరి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. లౌకికవాదాన్ని కాపాడేందుకు బీజేపీకి వ్యతిరేకంగా లౌకిక శక్తులను ఏకం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బావండ్ల పాండు, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, వినోద్, చౌగాని సీతారాములు, పోలేబోయిన వరలక్ష్మి, అయ్యూబ్, సత్యనారాయణరావు, రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, కె.రమేష్, పాపిరెడ్డి, రాంరెడ్డి, కోటిరెడ్డి, మంద రాజు, వెంకన్న, సైదులు, మణెమ్మ, రాములు, మల్లయ్య, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

మాడుగులపల్లి : కమ్యూనిస్టు పార్టీకి ఎనలేని సేవ చేసిన మహా మేధావి సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఎన్నో ఉద్యమాలు చేసిన సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకర్, వెంకటాచారి, నాగయ్య, వెంకటయ్య, నారాయణరెడ్డి, నాగయ్య, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం త్రిపురారం మండల సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను, రైతు సంఘం జిల్లా నాయకులు కొప్పు వెంకటయ్య, కందిమళ్ల వీరారెడ్డి, షేక్ జానీ, కుందేటి కోటయ్య, లింగమ్మ, భారతమ్మ, నవనీత, మేకల మధు, వెంకయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు : సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా నిడమనూరు సీపీఎం నాయకులు శుక్రవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ, దేశంలో మతోన్మాదం, ప్రజా సమస్యలపై చట్టసభల్లో ఎంతగానో పోరాడిన నాయకుడు ఏచూరి అని అన్నారు. ఏచూరికి నివాళులర్పించిన వారిలో మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, మల్లికంటి చంద్రశేఖర్, వింజమూరి శివ, కుంచెం శేఖర్, బాల నారాయణ, సుదర్శన్, కేశవులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

డాక్టరేట్ పొందిన జావిద్‌కు అభినందన

మిర్యాలగూడ : వేములపల్లి గ్రామానికి చెందిన షేక్ జావిద్ ముస్లింవాద సాహిత్యం, సామాజిక వాస్తవికతపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. శుక్రవారం జావిద్‌ను మిర్యాలగూడలోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అభినందించి సన్మానించారు. కామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, చిర్ర మల్లయ్యయాదవ్, కట్టా మల్లేష్‌గౌడ్, దైద జాన్సన్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, గౌరు శ్రీనివాస్, పవన్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

హాలియా : అనుముల మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాంపాటి పాండరయ్య, సెక్రటరీగా పుల్లారెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీగా రామ లింగయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మనోహర్ రావు, వైస్ ప్రెసిడెంట్‌గా అనిమిరెడ్డి, మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా ఉమాదేవి, జాయింట్ సెక్రటరీగా రవీందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దైవజ్ఞాచారి, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్ఎన్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీశైలం, కోట్ల రామలింగం ఎన్నికల అధికారిగా, కీసర యుగేందర్‌రెడ్డి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

టీఆర్ఎస్‌కేవీ ప్యానల్ విజయం

మిర్యాలగూడ : మాడ్గులపల్లి మండలం కుక్కడం వద్ద గల విశాఖ ఇండస్ట్రీస్‌లో ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కేవీ(బీఆర్‌టీయూ), ఐఎన్‌టీయూసీ కూటమి ప్యానె ల్ విజయం సాధించింది. మొత్తం 70 ఓట్లకు గాను కూటమి ప్యానల్ 43ఓట్లు సాధించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మిర్యాలగూడలోని తన కార్యాలయం వద్దకు వచ్చిన కూటమి ప్యానల్ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాలుట్ల బాబయ్య, వెంకన్న, సభ్యులు మేడి సుందర్, వేణు, నాగయ్య, వెంకన్న, శేఖర్, శ్రీనివాస్, రామలింగయ్య, మల్లేష్, విజయ్, కందుల శ్రీనివాస్, హరిబాబు, బాలునాయక్, భాస్కర్, శ్రీను, కోటేష్ పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

నిడమనూరు: ఊట్కూరు–నందికొండవారిగూడెం గ్రామాల మధ్య నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి దిగువన ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో శుక్రవారం కాంట్రాక్టర్‌తోనే పంచాయతీ ఇంజనీర్ సాయిప్రసాద్ రోడ్డు మరమ్మతులు చేయించి రాకపోకలు పునరుద్ధరించారు.

ఫార్మా మార్కెటింగ్‌లో రాణిస్తున్న శాఖాపురం వాసి

నిడమనూరు : ఫార్మా మార్కెటింగ్ రంగంలో మండలంలోని శాఖాపురం గ్రామానికి చెందిన వల్లపుదాసు సత్యనారాయణ రాణిస్తూ పలువురు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఫార్మా దిగ్గజం సన్ ఫార్మా అధినేత దిలీప్ షాంగ్వీ నుంచి గురువారం రాత్రి ఘన సత్కారం అందుకున్నారు. సత్యనారాయణ గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని శాఖాపురం మాజీ సర్పంచ్ ఇరుగుల వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు చేకూరి సూర్యనారాయణ, గురువారెడ్డి, సురేష్‌రెడ్డి, బొజ్జ లాజీ, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సాదాబైనామా క్రమబద్ధీకరణ.. చిత్తశుద్ధికి నిదర్శనం

హాలియా : సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తుండడం కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని నాగార్జున సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని దాదాపు 9 లక్షల 80 వేల మంది చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

కోర్టు కేసుపై ఎంపీడీఓ వివరణ

మిర్యాలగూడ : దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శికి సంబంధించిన కేసుపై ఎంపీడీఓ అలివేలుమంగ శుక్రవారం వివరణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి శాలరీ సర్టిఫికెట్ కేసు విషయమై న్యాయమూర్తి తనను కోర్టుకు హాజరు కావాలని పిలిచారని, ఈ కేసు విషయంలో కార్యాలయం సూపరింటెండెంట్ కోర్టు హాజరయ్యారని పేర్కొన్నారు. తాను కార్యాలయం పని వల్ల హాజరు కాలేకపోయారని చెప్పి వాయిదా తీసుకున్నానని.. గత నెల 26వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎంపీడీఓలతో సమావేశం ఉన్నందున కోర్టుకు హాజరు కాలేకపోయానని, కేసుకు సంబంధించిన లేఖను సిబ్బందితో పంపానని తెలిపారు. వారు కోర్టు ఇన్‌వార్డులో ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయంపై కోర్టులో హాజరు కాగా ఈనెల 19న పూర్తి వివరాలు అందించాలని న్యాయమూర్తి ఆదేశించారని తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం ఎన్నిక


ఎన్నికైన సభ్యులను శాలువాలతో సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నాగార్జునసాగర్ : హాలియా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో రిటైర్డ్ ఉపాధ్యాయుల సాగర్ అర్బన్ యూనిట్‌కు శుక్రవారం మొదటిసారిగా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలకు సంఘం జిల్లా అధ్యక్షుడు గానుతల వెంకట్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సంఘం మరింత బలోపేతం కావాలని సూచించారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా విద్యా, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో చురుకుగా ఉండాలని కోరారు. కమిటీ అధ్యక్షుడిగా పల్‌రెడ్డి నర్సింహారెడ్డి, కార్యదర్శిగా ఎస్.సాంబశివరావు, కోశాధికారిగా వడ్లపల్లి నర్సిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా తేర నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బోయ కేశవరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎం.సీతకళ్యాణి, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ ఈశ్వరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.బాలాజీ, పబ్లిక్ సెక్రటరీగా బి.సరోజినీదేవి ఎన్నికయ్యారు. ఎన్నికల అబ్జర్వర్‌గా కె.యుగెందర్‌రెడ్డి, ఎలక్షన్ ఆఫీసర్‌గా ఆంజనేయులు వ్యవహరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


పెద్దవూర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్

పెద్దవూర: ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, మినీ గురుకుల విద్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో వంట గది పరిసరాలు, పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థులను పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట ఎంపీడీఓ ఉమాదేవి, పాఠశాల హెచ్‌ఎం డి. బాలాజీ, వార్డెన్ కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు డి. శ్రీనునాయక్, సంధ్య, షాహీన్‌బేగం, సైదులు, శాంతి, షబ్బీర్, కృష్ణ ఉన్నారు.